క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



కొత్త కార్యవర్గ సభ్యులు వీరే..

విజయనగరం అర్బన్: జిల్లా రెవెన్యూ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక రెవెన్యూ హోమ్‌లో ఆదివారం జరిగింది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల అధ్యక్షులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించగా జిల్లా అధ్యక్షుడిగా తాడ్డి గోవింద, కార్యదర్శిగా ఐ.సూర్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా పి.ఆదిలక్ష్మి, వీవీఆర్ జగన్నాథరావు, రెడ్డి సాయికృష్ణకుమార్, బి.శంకరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.సంజీవ్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా కె.హరికృష్ణ, వి.నారాయణమ్మ, ఎ.రామారావు, కె.రమేష్, కోశాధికారిగా కె.జోగినాయుడు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా వి.ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా ఎస్‌వీవీఎస్ మూర్తి, వి.సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

స్వామీ వివేకానంద విగ్రహావిష్కరణ



నెల్లిమర్లలో ఆవిష్కరించిన వివేకానంద విగ్రహం

నెల్లిమర్ల: స్థానిక పట్టణంలోని వివేకానంద ధ్యాన మందిరంలో కొత్తగా ఏర్పాటు చేసిన స్వామీ వివేకానంద విగ్రహాన్ని ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వామీ వివేకానంద బోధనలు ప్రపంచానికే ఆదర్శమన్నారు. అంతర్జాతీయ వేదికలపై మన దేశ గొప్పతనాన్ని ఆయన చాటిన తీరు అభినందనీయమన్నారు. అందరూ ఆయనను ఆదర్శంగా తీసుకుని జీవించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరామకృష్ణ సేవాసమితి కార్యదర్శి జగన్నాథ రాజు, విశాఖపట్నం రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వసంవేద్యానందజీ మహరాజ్, రాజమండ్రి రామకృష్ణ మఠం అధ్యక్షుడు పరిజ్ఞేయానందజీ మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

విజయనగరం టౌన్: నిరుపేద విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయడం ఆనందంగా ఉందని ఆలిండియా శిష్టకరణ సంఘం అధ్యక్షుడు డీవీ కృష్ణారావు అన్నారు. స్థానిక కేఎల్ పురం కమ్యూనిటీ హాల్‌లో జిల్లా శిష్టకరణ సంఘం అధ్యక్షుడు గౌరీశ్వరరావు ఆధ్వర్యంలో చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఆదివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుపేద శిష్టకరణ కుటుంబాలన్నింటికీ ఇలా సేవ చేయాలనే సంకల్పం చాలా గొప్పదన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు సంఘం నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర శిష్టకరణ సంఘ అధ్యక్షుడు పోలి మహంతి ఉమామహేశ్వరరావు, కార్యదర్శి బెలగాం జయబాబు, ఉపాధ్యక్షుడు సుధాకర్ పటా్నయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగ సురేష్, కోశాధికారి వి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకంగానే షెడ్డు తొలగించారు..



మాట్లాడుతున్న గ్రామస్తులు

పూసపాటిరేగ: మండలంలోని కొవ్వాడ గ్రామంలో శ్మశానవాటికలోని షెడ్డును ఉద్దేశపూర్వకంగానే గ్రామ సర్పంచ్ తొలగించారని గ్రామానికి చెందిన పలువురు ఆరోపించారు. గ్రామంలోని సామంతుల సోంబాబు ఇంటి వద్ద ఆదివారం సమావేశమైన గ్రామస్తులు ఈ విషయంపై మాట్లాడారు. గ్రామంలో బీసీలతో పాటు ఇతర కులాలు వినియోగించిన శ్మశాన వాటికలోని షెడ్డును కావాలని తొలగించడం అన్యాయమన్నారు. స్మశానం ఆనుకుని రియల్ వెంచర్ ఉండడం వల్లే షెడ్డు తొలగించారన్నారు. ఇలాంటి దురాలోచన ఉంచుకుని, వాస్తు, సుందరీకరణ పేరిట పంచాయతీ తీర్మానం మేర తొలగించామని చెప్పడం సమంజసం కాదన్నారు. తొలగించిన షెడ్డు స్థానంలో నూతనంగా షెడ్డు నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో గ్రామస్తులు సామంతుల సోంబాబు, చందక హరిబాబు, పప్పల నారాయణరావు, పిన్నింటి శ్రీను, మహంతి శ్రీను, పప్పల పెంటం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- వానాకాలంలో వ్యాధుల ముప్పు
- జలుబు, దగ్గు, వైరల్ జ్వరాలు వచ్చే అవకాశం
- జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు

వర్షాకాలం.. తస్మాత్ జాగ్రత్త!



విజయనగరం: వేసవికాలం ముగిసి, వర్షాకాలం వచ్చింది. గత కొన్నిరోజులుగా వానలు దంచికొడుతున్నాయి. వానల కారణంగా ఏర్పడిన చల్లని వాతావరణం అందరికీ బాగానే అనిపిస్తుంది. కానీ ఇదే అన్ని కాలాల కన్నా ప్రమాదకరమని, జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వానాకాలంలో శీతల వాతావరణానికి జలుబు, దగ్గు, గొంతులో కఫం వంటి సమస్యలతో పాటు మలేరియా, టైఫాయిడ్, డయేరియా, చికెన్ గున్యా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు కూడా వ్యాప్తి చెందుతాయని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాల పరిశుభ్రంగా పాటించాలని చెబుతున్నారు.

దోమలు వృద్ధి చెందకుండా..

వర్షాకాలంలో పడే వానలకు లోతట్టు ప్రాంతాలు, కాలువలు, రోడ్లు ఇలా ఎక్కడ పడితే అక్కడ నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండే అవకాశం ఉంది. దీంతో ఆయా చోట్ల దోమలు వృద్ధి చెందుతాయి. దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి జ్వరాలు ప్రబలుతాయి. ఇది జరగకుండా ఉండాలంటే వర్షపునీటి నిల్వల ప్రాంతాలు ముందుగానే గుర్తించి, అవి వరదనీటితో నిండగానే అక్కడ దోమలు పెరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలి. అలాగే ఆహార పదార్థాలపై దోమలు, ఈగలు వాలకుండా చూసుకోవాలి. వర్షాల వల్ల భూగర్భ జలం మారే అవకాశం ఉన్నందున జలుబు, దగ్గు రాకుండా కాచివడపోసిన నీటిని తాగాలి.

చేపట్టాల్సిన చర్యలివే..

- కాలానుగుణ వ్యాధులను అరికట్టేందుకు పారిశుధ్య పనులు సక్రమంగా చేయించాలి
- జనావాసాల వద్ద మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి
- దోమల నియంత్రణకు ఫాగింగ్ చర్యలు చేపట్టాలి
- ఇళ్లల్లోని తలుపులు, కిటికీలకు దోమలు రాకుండా మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలి
- నీటి టబ్బులు, డ్రమ్ములను రెండు, మూడు రోజులకోసారి శుభ్రంగా కడగాలి
- దోమతెరలు వినియోగించాలి
- కాచివడపోసిన నీటిని తాగాలి
- చిన్నారులు వానలో తడవకుండా చూసుకోవాలి
- ఆహారం కొంచెం వేడిగా ఉన్నప్పుడే తినాలి

చర్యలు చేపడుతున్నాం..

వర్షాకాలం మొదలైనందున సీజనల్ వ్యాధులు విజృంభించకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా పారిశుధ్యం మెరుగుపరుస్తున్నాం. దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నాం. కాలువల్లో పూడికతీతలు, రోడ్డుపై చెత్తాచెదారం తొలగిస్తున్నాం.

కె.సాంబమూర్తి,
కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి, విజయనగరం

29న సీఐటీయూ నాలుగో నగర మహాసభ



వాల్‌పోస్టరు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

విజయనగరం గంటస్తంభం: స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఈ నెల 29వ తేదీన సీఐటీయూ నాలుగో నగర మహాసభ నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ నగర అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్మోహనరావు, ఆర్.శంకరరావు, బి.రమణలు తెలిపారు.

స్థానిక తోటపాలెం, ఎల్బీజీ భవన్‌లో ఆదివారం సమావేశం నిర్వహించి, మహాసభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై సీఐటీయూ చేసిన పోరాటాలు, విజయాలను సభలో తెలియజేయడం జరుగుతుందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9వ తేదీన జరగనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు ఆదినారాయణ, గురుమూర్తి, భాస్కరరావు, స్వప్న, రాజేశ్వరి, సురేష్, పైడిరాజు, రాజు, కృష్ణ, గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎంఎస్ నాయకులు, తదితరులు

విజయనగరం అర్బన్: ఫ్యాక్టరీల సవరణ బిల్లు–2025ను సవరించాలని బీఎంఎస్(భారతీయ మజ్దూర్ సంఘ్) జిల్లా అధ్యక్షుడు నల్లా అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఇదే విషయమై జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆదివారం నిరసన చేపట్టారు. అంతకుముందు చేపట్టిన బైక్ ర్యాలీలో కేంద్రం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. అనంతరం చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఉద్యోగ, కార్మికుల శ్రేయస్సు, ఆరోగ్యం, కుటుంబ వ్యవస్థలపై చట్టం తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోందని, నూతన సవరణ చట్టం బిల్లులో పని గంటలు 9 నుంచి 10 గంటలకు పెంచడం, విరామానికి ముందు పని సమయాన్ని 5 నుంచి 6 గంటలకు పెంచడం, మహిళా కార్మికులను సేఫ్ గార్డుల్లో రాత్రి షిఫ్ట్‌ల్లో పనిచేయడానికి అనుమతించడం వంటి సమస్యలు ఎదురవుతాయన్నారు. కార్మికు లకు అన్యాయం చేసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కార్మికులకు మేలు చేసేలా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో బీఎంఎస్ యూనియన్ ప్రతినిధులు శ్రీనివాస్, సత్యం, మాంగ్లే, ప్రభాకర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొద్దాం - కళ్లెంపూడి రోడ్డును అభివృద్ధి చేయాలి



బొద్దాం-కళ్లెంపూడి రహదారిపై నిరసన తెలియజేస్తున్న జగన్, తదితరులు

- ఆందోళన చేపట్టిన స్థానికులు

వేపాడ: దశాబ్దాలు గడిచినా బొద్దాం – కళ్లెంపూడి రహదారి అభివృద్ధికి నోచుకోకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు ఏపీ రైతు సంఘ ఉపాధ్యక్షుడు జగన్ నేతృత్వంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. రహదారిపై నిలిచిఉన్న నీటిలో కూర్చుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. పదిహేనేళ్లుగా ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో రోడ్డుపై గజానికో గుంత ఏర్పడిందన్నారు. ఈ రహదారిపై బొద్దాం, ముకుందపురం, ఓబలయ్యపాలెం, కళ్లెంపూడి గ్రామాలకు చెందిన వారు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. గోతుల్లో పడి చాలా మంది ప్రమాదాల బారిన కూడా పడ్డారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఇతర హైవేలంటూ నియోజకవర్గాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న అధికారులు, పాలకులు అధ్వానంగా ఉన్న బొద్దాం – కళ్లెంపూడి రహదారిని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు చలుమూరి శ్యామ్, పి.నగేష్, సాయిరాం, బొద్దాం, ఓబలయ్యపాలెం, ముకుందపురం విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ డీఈఈ త్రినాధరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. 11 కేవీ వ్యవసాయ విద్యుత్ లైన్ల మరమ్మతులు, విద్యుత్ తీగలను తాకే చెట్లకొమ్మల తొలగింపు నేపథ్యంలో పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, బొడ్డపేట, ఒమ్మి, వెంకన్నపాలెం, మల్యాడ గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

విజయనగరం టౌన్: స్థానిక రామానాయుడు రోడ్డులో కొలువైన కోటసత్తెమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త ఒబ్బిలిశెట్టి వెంకటేశ్వర్లు ఉత్సవాలు ఆరంభించి, ఆలయ ఆవరణలో హోమాలు చేశారు. అనంతరం భక్తులంతా అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ పారాయణాలు, కుంకుమార్చనలు ఉంటాయని మంగళవారం సాయంత్రం పెద్దచెరువులో తెప్పోత్సవం, ఊరేగింపు ఉంటుందన్నారు.

ఘనంగా ఫాదర్స్ డే

విజయనగరం టౌన్: స్థానిక యేసు ప్రేమాలయంలో ఫాదర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ అలజంగి రవికుమార్‌ను మతవిశ్వాసకులు సన్మానించారు. అనంతరం దేవదేవుడైన ఏసుక్రీస్తు ప్రజలను తన సొంత బిడ్డల్లా చూసుకున్న తీరును వాక్యోపదేశం ఆధారంగా వివరించారు. ప్రతిఒక్కరూ దైవాన్ని, తల్లిదండ్రుల యందు ప్రేమ, భయభక్తులు కలిగి ఉండాలని తెలిపారు.

నేడు వేంకటేశ్వరస్వామి ఆలయ పదో వార్షికోత్సవం



విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామి

వేపాడ: మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ పదో వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల కిందట దాతలు, పెద్దలు, గ్రామస్తుల సహకారంతో 105 రోజుల్లో నూతన ఆలయం నిర్మించామన్నారు. నాటి నుంచి స్వామివారికి ప్రతిరోజూ సుప్రభాత సేవ, అర్చన.. ప్రతి శుక్రవారం స్నపన తిరుమంజనం.. శనివారం ప్రత్యేక పూజలు.. వైకుంఠ ఏకాదశి, మార్గశిర మాసం వంటి ప్రత్యేక పర్వదినాల్లో విశేష అర్చనలు చేడతామని చెప్పారు. వార్షికోత్సవంలో భాగంగా సోమవారం ఉదయం 5.30 గంటలకు సుప్రభాతసేవ, స్నపన తిరుమంజనం నిర్వ హిస్తామన్నారు. అలాగే 9.30 గంటల నుంచి అనకాపల్లికి చెందిన శ్రీమాన్ శ్రీరేజేటి గోప అప్పలాచార్యులు (చక్రవర్తి) వేద పండిత బృందంచే శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నదానం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

● రాళ్లు తేలిన రోడ్డు



ఈ చిత్రంలో కనిపిస్తోంది..నెల్లిమర్ల మండలం, సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంకు కూతవేటు దూరంలోని ప్రధాన రహదారి. దారంతా అధ్వానంగా తయారైంది. రోడ్డు పొడవునా పైకితేలిన రాళ్లు ఉండడంతో ఈ దారిలో నడిచి వెళ్లాలంటే నరకం చూస్తున్నామని పాదచారులు వాపోతున్నారు. వాహనదారులైతే బండ్లు పాడవుతున్నాయని, ప్రయాణికులైతే ఒళ్లు హూనమైపోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, త్వరితగతిన రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు.

–నెల్లిమర్ల రూరల్

● పొంచిఉన్న ప్రమాదం



నెల్లిమర్ల మండలం, సీతారామునిపేట జంక్షన్ నుంచి కొత్తపేటకు వెళ్లే దారిలో ప్రమాదం పొంచి ఉంది. గిరి ప్రదక్షిణ రోడ్డు పనుల్లో భాగంగా కల్వర్టుల నిర్మాణం నిమిత్తం జగనన్న కాలనీ సహా మరో ఐదారు ప్రాంతాల్లో భారీ గుంతలు తవ్వారు. వాటిని ఇప్పటికీ అలానే వదిలేశారు. అదే దారిలో బోడికొండ, గురుభక్తుల కొండ, జైనుల కొండ, పురాతన స్థూపాలు చూసేందుకు సుదూర ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివస్తుంటారు. ప్రమాదకరంగా ఉన్న ఆ గోతులు చూసి అటువైపుగా వెళ్లే వారంతా భయపడుతున్నారు. ఇలా వదిలేశారేంటి..కనీసం హెచ్చరిక బోర్డు అయినా ఏర్పాటు చేయరా అని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని సందర్శకులు కోరుతున్నారు.

–నెల్లిమర్ల రూరల్

● వేతన బకాయిలు చెల్లించండి



104 వాహన సిబ్బందికి అరబిందో సంస్థ చెల్లించాల్సిన బకాయి వేతనాలను చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని 104 వాహన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అద్దెపల్లి రామరాజు డిమాండ్ చేశారు. విజయనగరంలోని ఎల్‌బీజీ భవన్‌లో ఆదివారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈఎల్, గ్రాట్యుటీ చెల్లించాలని, ప్రస్తుతం 104ను నిర్వహిస్తున్న భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ యాజమాన్యం కూడా సిబ్బందికి ప్రతినెలా సక్రమంగా జీతాలు చెల్లించాలన్నారు. అలాగే జిల్లాలోని ఖాళీ పోస్టుల్లో సీనియార్టీ ప్రకారం బదిలీలు చేసి, ఆ తర్వాత మిగిలిన స్థానాలను కొత్త వారితో భర్తీ చేయాలని కోరారు. 104 వాహనాల్లో క్షయ పరీక్షలకు సంబంధించి నమూనాల రవాణా మంచిది కాదన్నారు. సమావేశంలో సంఘ నాయకులు ప్రవీన్, కోటారావు, ఆర్.ఎస్.నాయుడు, జ్యోతి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

–విజయనగరం ఫోర్ట్

● సంక్షేమ క్యాలెండర్ విడుదల చేయాలి



ప్రభుత్వం తక్షణమే సంక్షేమ క్యాలెండర్ విడుదల చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన నెల్లిమర్ల మండలం, కొండగుంపాంలో విలేకరులతో ఆదివారం మాట్లాడారు. అధికారమే లక్ష్యంగా లేనిపోని హామీలను ఎరగా వేసి ప్రజల నుంచి ఓట్లు దండుకున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎన్నికల హామీలు అమలులో విఫలమైందని విమర్శించారు. కొత్త పింఛన్ల మంజూరు, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 ఇలా ఎన్నో హామీలు అమలు చేయడం లేదన్నారు. ఆఖరికి వారు అమలు చేసిన ఒకట్రెండు పథకాలు కూడా పూర్తిస్థాయిలో అమలుకావడం లేదన్నారు. గ్యాస్ తీసుకున్న వారిలో చాలామందికి డబ్బులు పడడం లేదని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పిల్లలకు తల్లికి వందనం ఇవ్వడం లేదని ఉదహరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏ పథకం ఎప్పుడు అమలు చేస్తున్నారోనన్న దానిపై స్పష్టత ఇవ్వాలన్నారు.

–నెల్లిమర్ల రూరల్

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

దత్తిరాజేరు: మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ఎస్.భూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ సూచించారు. ఎస్.భూర్జవలసలో ఆదివారం పోలీసు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేశారు. ఈసందర్భంగా వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. లైసెన్స్ లేని వారు వాహనాలు నడపరాదని, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలని అన్నారు.

గోరక్షక్ వీర్ పురస్కారం..

బొబ్బిలి: బొబ్బిలి ఉప ఖజానాధికారి పి.వి.పద్మనాభంను రాష్ట్రీయ గోరక్షక్ వీర్ పురస్కారం వరించిం ది. ఢిల్లీకి చెందిన శ్రీదేవి కల్యాణ సేవా ట్రస్ట్ ఈ పురస్కారాన్ని అందజేసింది. గోవుల సంరక్షణ, కబేళాల మూసివేత వంటి కార్యక్రమాలతో సుమారు 500 గోవులను సంరక్షించడం, మూడు గోవధశాలల మూసివేయించినందుకు పద్మనాభంను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.